


నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, ఇంతియాజ్ ఇసాక్



**వేడుకైదేనా ఇంత చుక్క.. ఇంత ముక్క నోట్లో పడితేనే జోష్..**

*అదే న్యూయర్ వేడుక అయితే ఇక చెప్పేదేముంది.. మందుబాబులకు పండుగే పండుగ.. ఎప్పట్లాగే ఈసారి 2024కు వీడ్కోలు పలుకుతూ.. 2025కి స్వాగతం తెలిపేందుకు డిసెంబర్ 31న రాత్రి పీకల దాకా తాగేశారు. వయోభేదం లేకుండా అందరూ మందేసి చిందేశారు. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ నాలుగు రోజుల్లోనే రూ. 54.41 కోట్లకుపైగా మింగేశారు. కొత్తసంవత్సర వేళ పేద, ధనిక తేడా లేకుండా రాత్రంతా మద్యం మత్తులో ఊగిపోయారు. న్యూ ఇయర్ వేడుకలు ఫుల్ జోష్‌గా సాగగా.. ఎక్సైజ్ శాఖకు బోలెడు ఆదాయం సమకూరింది.*

*– మహబూబ్‌నగర్, జనవరి 1*

- డిసెంబర్ 31 వేడుకల్లో మందేసి చిందేసిన వైనం
- నాలుగు రోజుల్లో తాగింది రూ.54.41 కోట్లు..
- ఎక్సైజ్ శాఖకు అ'ధనం'
- మాంసం, కేకులు, స్వీట్లకు భారీగానే ఖర్చు
- పాలమూరులో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 98 మంది

# తెగతాగేశారు..!

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జోష్ కనిపించింది. మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. ఈ సారి డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచి వైన్స్‌లు, బార్లు, హోటళ్లు, చికెన్, మటన్ షాపులతో పాటు చేపల విక్రయం కేంద్రాల ఎదుట వినియోగదారులు బారులు దీరారు. గడిచిన నాలుగు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రూ. 54.41కోట్ల మద్యం విక్రయాలు జరిగాయంటే మందుబాబులు చీర్స్ ఏ మేరకు జరిగిందనేది స్పష్టమవుతోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మద్యం విక్రయాలు అధికంగా జరిగినట్లు సేల్స్‌ను బట్టి తెలుస్తోంది.

**ఏరులై పారిన మద్యం**

ఈ ఏడాది నూతన సంవత్సరం వేడుకల్లో మద్యం ఏరులై పారినట్లూ తెలుస్తోంది. ఇందుకు జిల్లా ఎక్సైజ్ శాఖ గణాంకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 230 వైన్స్‌లు, 36 బార్లు ఉన్నాయి. న్యూఇయర్ సందర్భంగా విక్రయాలు డిసెంబర్ అర్ధరాత్రి 12గంటల వరకు కొనసాగాయి.

సాధారణ రోజుల్లో రాత్రి 10గంటలకే మూసివేయగా మందుబాబుల సౌకర్యార్థం తెరిచి ఉంచారు. దీంతో బార్లు , వైన్సులన్నీ ఉదయం నుంచి మూసేంతవరకు కొనుగోలు దారులతో సందడిగా కనిపించాయి. మద్యం విక్రయాలు నాలుగు రోజులో రూ. 54.41 కోట్ల విలువ గల విక్రయాలు జరిగాయి. దీంతో ఎక్సైజ్‌శాఖకు ఆదాయం అధికంగా సమకూరడం గమనార్హం.

**పెరిగిన మాంసం విక్రయాలు**

డిసెంబర్ 31 అంటేనే మందు సుక్క, మటన్, చికెన్ ముక్క ఉండడం సహజం, ఏటా ఈ రోజున మద్యంతో పాటు మాంసం విక్రయాలు భారీ గా సాగుతాయి. మద్యం దుకాణాలతో పాటు నాన్‌వెజ్ విక్రయ కేంద్రాలు జనంతో సందడిగా మారాయి.

**విచ్చల విడిగా బెల్ట్ దుకాణాలు**

ప్రభుత్వానికి వచ్చే ఆదాయ వనరుల్లో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖలు ప్రధానమైనవి. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆ ఆదాయన్ని మద్యం దుకాణాల ద్వారా పెంచుకునేందుకు విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ద్వారా మద్యం విక్రయాలు పెంచుకోవాలని పరోక్షగా ఎక్సైజ్‌శాఖనే ప్రోత్సహిస్తోంది. అందుకే ఊర్లలో, వాడవాడల్లో బెల్ట్ దుకాణాలు వెలిశాయి. మద్యం పర్మిట్ రూమ్‌లు దాబాల్లో కూడా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగాయి. మద్యం దుకాణాలు దందా పరోక్షగా బెల్లు దుకాణాలపైనే ఆధారపడి సాగుతుందన్నా విషయం బహిరంగ రహస్యమే. మద్యం కోసం రూ. 2,700 కోట్లు తగలేస్తున్న మందుబాబులు అందులో మంచింగ్ కోసం మరో రూ.వెయ్యి కోట్లను ఖర్చు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం కోసమే జనాలు ఏడాదికి రూ. 4,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.



ఉండవెల్లి మండలంలోని కేక్ కట్ చేస్తున్న యువకులు

# నూతనోత్సాహం

- అంబరాన్నంటిన 'కొత్త' సంబురం
- సరదాగా గడిపిన ఉమ్మడి జిల్లావాసులు
- పార్కులు, పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి
- అర్ధరాత్రి వరకు కేక్ కటింగ్‌ల హోరు
- కోవెల్లో భక్తుల కోలాహలం

*కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ నూతనోత్తేజం ఉట్టిపడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. డిసెంబర్ 31న విందు, వినోదాలతో ఆనందంగా సందడి చేశారు. పటాకులు కాల్చుతూ సంబురాలు కేరింతలు కొడుతూ కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికారు. కేక్ కటింగ్‌లు, న్యూ ఇయర్ విషెస్‌తో సందడి నెలకొంది. కోటి ఆశలతో ప్రణాళికలు రూపొందించుకొని.. సంతోషంగా గడిపారు. మహిళలు ఇండ్ల ముందు రంగవల్లులు వేశారు. చిన్నాపెద్ద అంతా ఆలయాలను దర్శించుకున్నారు. క్రైస్తవులు చర్చీలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పార్కులు.. పర్యాటక ప్రాంతాలకు తాకిడి పెరిగింది. వేడుక ప్రజల్లో జోష్ నింపింది.*

*– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 1*



మహబూబ్‌నగర్ మయూరీ పార్కు వద్ద..



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షించిన ఎస్పీ జానకి

## పాలమూరులో రెచ్చిపోయిన మందుబాబులు

కొత్త సంవత్సరంలో అడుగుపెడుతున్నా సందర్భంగా మందుబాబులు రెచ్చిపోయారు. మోతాదుకు మించి మద్యం తాగిన వారిని డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి పోలీసులు పట్టుకున్నారు. డిసెంబర్ 31వేడుకల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్నా 98మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 11 చోట్ల ప్రత్యేక తనిఖీలు చేపట్టి మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. పట్టణం లో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 98 మంది పట్టుబడగా జరిమానా విధించారు. అలాగే అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, మైనర్లు, నడుపుతున్నా వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నారు. పాలమూరు జిల్లాలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీలను జిల్లా ఎస్పీ జానకి పరిశీలించారు.

# వాటర్ లీకేజీ

- శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఘటన
- యూనిట్-1 వద్ద నిమిషానికి 4 లీటర్ల చొప్పున ధార
- ఎలాంటి ప్రమాదం లేదన్న ప్రాజెక్టు సీఈ రామసుబ్బారెడ్డి

అచ్చంపేట, జనవరి 1 : శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం వద్ద వారం రోజులుగా నీటి లీకేజీ జరుగుతోంది. పవర్ హౌజ్‌లోని 1వ యూనిట్ జీరో ఫ్లోర్ డ్రాఫ్ట్‌ట్యూబ్ నుంచి నీటి ధార కొనసాగుతున్నది. డ్రాఫ్ట్‌ట్యూబ్ నుంచి లీకేజీ జరుగుతున్న విషయాన్ని డిసెంబర్ 25వ తేదీన సిఫ్ట్ అధికారులు గుర్తించి జెన్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జెన్‌కో అధికారులు లీకేజీని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్‌సౌధ నుంచి జనరల్ సర్వీసెస్ సీవిల్ సీఈ హైడల్ నారాయణ వచ్చి పరిశీలించారు. లీకేజీకి సంబంధించి నివేదిక ఇవ్వాలని స్థానిక ఇంజినీర్లను ఆదేశించారు. నీటి లీకేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అక్కడ సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. గంటగంటకు వెళ్లి షిఫ్ట్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. అయితే రీవర్స్ విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల వైబ్రెషన్‌కు గురై నీటి ఒత్తిడి పెరిగి లోపల ఉన్న పైపు వెల్డింగ్ నుంచి లికేజీ అవుతున్నట్లు జెన్‌కో అధికారులు భావిస్తున్నారు. పంపు మోడ్‌లో టర్బైన్ వేగంగా తిరుగుతుండడంతో డ్రాఫ్ట్‌ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి నీటి ధారగా లీకేజీ జరుగుతుంది. సర్జి చాంబర్, పెన్‌స్టాక్ గేట్లను మూసివేసి, టర్బైల్‌లో నిల్వ ఉండే నీటిని పూర్తిగా తొలగించి లోపలికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. లీకేజీని పరిశీలించాలంటే నాగార్జునసాగర్‌లో వాటర్ లెవల్ తగ్గాలని ఎస్ఈ సివిల్ రవీంద్రకుమార్ తెలిపారు. ప్రమాదం లేదని, కాంక్రీట్‌కు వెల్డింగ్ చేస్తే సరిపోతుందని తెలిపారు.



డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ వద్ద లీకేజీ దృశ్యం

**చిన్ననీటి ధారతో ఎలాంటి ప్రమాదం లేదు**

చిన్నపాటి నీటి ధార వస్తుంది. నిమిషానికి 3-4లీటర్ల వరకు లీకేజీ అవుతున్నది. డిసెంబర్ 25వతేదీ నుంచి లీకేజీ ప్రారంభమైంది. అక్కడ సీసీ కెమెరా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు మా సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలిస్తున్నారు. పెరిగిందా? తగ్గిందా? అనేది పరిశీలన చేస్తున్నాం. లీకేజీ ప్రారంభమైనప్పటి నుంచి ఒకేవిధంగా నీటి ధార వస్తోంది. బుధవారం నుంచి రీవర్స్ పంపింగ్ విద్యుదుత్పత్తిని ఆపేశాం. అండర్‌గ్రౌండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఇలాంటి చిన్న చిన్న లీకేజీలు సహజం. లోపలికి వెళ్లి పరిశీలించాలంటే నాగార్జునసాగర్‌లో వాటర్ లెవల్ తగ్గాలి. కాంక్రీట్‌లో వెల్డింగ్ వేస్తే సరిపోతుంది.

**- రామసుబ్బారెడ్డి, సీఈ**



బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న నిరంజన్‌రెడ్డి

## అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

- నూతన సంవత్సవ వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 1: నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగించాలని, రాబోయే కాలంలో పార్టీ శ్రేణులందరికీ మంచి జరగాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆకాంక్షించారు. 2025 నూతన సంవత్సర వేడుకలను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి పాల్గొని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నూతన సంవత్సర కేక్ కట్ చేసి ఒకరినొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నియోజకవర్గ, జిల్లా ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, మాణిక్యం, బండారు కృష్ణ, గంధం పరంజ్యోతి, నాగన్నయాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, జాత్రునాయక్, నీల స్వామి, మాధవరెడ్డి, నరేశ్, డానియేలు, సూర్యవంశపు గిరి, విశ్వనాథం, సురేష్, జోహెఋూస్సేన్, చిట్యాల రాము, శ్రీను, ముద్దుసార్, రమేశ్, శ్రీను, శివ, లక్ష్మణ్‌తోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



అయిజ : ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటిమట్టం

## ఆర్డీఎస్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అయిజ, జనవరి 1 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. తుంగభద్ర జలాశయం నుంచి ఆర్డీఎస్ ఇండెంట్ విడుదల చేస్తుండటంతో ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుతున్నది. బుధవారం ఆర్డీఎస్‌కు 856 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 670 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 480క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆర్డీఎస్ స్లూయిస్ గుండా దిగువకు 190 క్యూసెక్కులు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.7అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. టీబీ డ్యాం నుంచి జనవరి 5వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుండగా, జనవరి 10వ తేదీ వరకు ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం నిలకడగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో నీటినిల్వ పెరుగుతున్న దృష్ట్యా ప్రధాన కాల్వకు నీటి విడుదలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఈఈ పేర్కొన్నారు.

**టీబీ డ్యాంలో నీటి నిల్వ..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతోంది. బుధవారం ఇన్‌ఫ్లో 260 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,073 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 80.891 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1626అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

- ప్రారంభించిన డీటీసీ కిషన్

మహబూబ్‌నగర్, జనవరి 1 : నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.కిషన్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులకు రోడ్డు భద్రతపై అవగాహన, ఆర్టీసీ, ఆటోడ్రైవర్లకు సదస్సులను ఏర్పాటు చేసి ప్రమాదాలను ఆరికట్టడం, వాహనాలు నడపడం, అతివేగం వల్ల దుష్పరిణామాలు, ఆ తర్వాత ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. తాగి వాహనాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని ఇంకా పర్యవేక్షణ పెంచి ప్రమాదాలు తగ్గించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకునేందుకు అవకాశం ఉండదన్నారు. సమావేశంలో ఎంవీఐ రఘుకుమార్, ఆర్టీఏ అధికారులు ఉన్నారు.



రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీటీసీ కిషన్



అలంపూర్‌లో కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## కాలేజీ భవన నిర్మాణానికి భూమి పూజ

అలంపూర్, జనవరి 1 : అలంపుర్ పట్టణంలోని కస్తుర్బా పాఠశాలల ఆవరణలో కాలేజీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విజయుడు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు ,బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జోగుళాంబ బాలబ్రహేశ్వర స్వామి ఆలయాలను ఆయన దర్శించుకున్నారు.